సాక్షి
ప్రకాశం
బుధవారం । 26 । ఫిబ్రవరి । 2025



బాధితులకు భరోసా కల్పించాలి
బాధిత మహిళలు, చిన్నారులకు సఖి వన్‌స్టాప్ సిబ్బంది భరోసా కల్పించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. - 8లో..



ఫెన్సింగ్ సబ్ జూనియర్ జిల్లా క్రీడాకారులు వీరే..
ఫెన్సింగ్ సబ్ జూనియర్ క్రీడాకారుల ఎంపిక మంగళవారం నిర్వహించారు. - 8లో..

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 34/24
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి.


విద్యుత్ దీపాలంకరణలో ఒంగోలులోని కొత్తపట్నం బస్టాండు వద్ద ఉన్న రాజరాజేశ్వర స్వామి ఆలయం


విద్యుత్ కాంతుల్లో మెరిసిపోతున్న త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయం


త్రిపురాంతకేశ్వర స్వామి మూలవిరాట్

శంకరా.. శుభంకరా

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తవశంకరుని పూజించేందుకు జిల్లాలోని శైవక్షేత్రాలన్నీ ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శివరాత్రి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు.

- సాక్షి నెట్‌వర్క్

ఆక్రమణల ముసుగేసి..
బతుకులు కూల్చేసి!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు బడుగుల జీవితాలతో చెలగాటం మొదలెట్టింది. అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఒంగోలు నగరంలో పేదల ఇళ్లు..చిరువ్యాపారులే టార్గెట్‌గా విధ్వంసానికి దిగింది. ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న నిరుపేదల ఇళ్లను ఆక్రమణల పేరుతో కూల్చివేయడంతో తలదాచుకునేందుకు గూడు లేక రోడ్డున పడ్డారు. కూరగాయలు అమ్ముకునే చిరు వ్యాపారుల దుకాణాలు ఉన్నట్టుండి కూల్చివేయడంతో దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. రోశయ్య విగ్రహం తొలగింపునకు యత్నం.. నేడు కొప్పోలు రోడ్డులో కూల్చి వేతలు ఇలా నగరంలో ఎటుచూసినా విధ్వంస దృశ్యాలే. ఏదో ఊహించి ఓట్లు వేశాం. ఇలా మా జీవితాలు నాశనం చేస్తారని ఊహించలేదంటూ బాధితులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

- నగరంలో కూటమి విధ్వంస పాలన
- ఆక్రమణల పేరుతో పారిశ్రామికవాడ, కొప్పోలులో కూల్చివేతలు
- అద్దె బకాయిల సాకుతో కొత్త కూరగాయల మార్కెట్లో దుకాణాల ధ్వంసం
- రోడ్డున పడిన నిరుపేదలు, చిరువ్యాపారులు
- ఖబరస్థాన్ స్థలం రద్దు.. ఆ స్థలంలో పార్కు అంటున్న దామచర్ల వైఖరిపై ముస్లింల ఆగ్రహం
- బాపూజీ కాంప్లెక్స్ వద్ద రోశయ్య విగ్రహం తొలగింపునకు యత్నాలు
- ఎమ్మెల్యే జనార్దన్ నిర్ణయాలపై వెల్లువెత్తుతున్న నిరసనలు


ఒంగోలు కొత్తకూరగాయల మార్కెట్‌లో దుకాణాలను కూల్చేస్తున్న మున్సిపల్ సిబ్బంది (ఫైల్)


పారిశ్రామిక వాడ వద్ద తమ ఇల్లు కూల్చేశారని రోదిస్తున్న మహిళ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే నగర శివారులోని పారిశ్రామికవాడ వద్ద ఆక్రమణల తొలగింపు పేరుతో నివాస గృహాలు, దుకాణాల కూల్చివేతతో పేదల జీవితాలపై కక్షసాధింపు చర్యలు ప్రారంభమయ్యాయి. పారిశ్రామిక వాడ వద్ద నివాసముంటున్న ప్రజలు న్యాయం కోసం న్యాయస్థానానికి వెళ్లారు. మరుసటి రోజు కోర్టులో విచారణ జరుగుతుందనగా ఒకరోజు ముందుగానే వేకువజామునే భారీ ఎత్తున పోలీసు బలగాలు, జేసీబీలతో వచ్చి పేదలు ఉంటున్న నివాసాలను అర్ధంతరంగా కూల్చివేశారు. కనీసం ఇళ్లలోని సామాన్లు సర్దుకొనే అవకాశం ఇవ్వకుండా జేసీబీలతో కూల్చివేశారు. బాధితులు రోడ్డుపై నిరసనలకు దిగితే పోలీసుల చేత చెదరగొట్టారు. చివరికి కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసనలు చేసినా ప్రయోజనం లేదు.

కూరగాయల మార్కెట్ ధ్వంసం...

కొత్త కూరగాయల మార్కెట్ ధ్వంసంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బకాయిల పేరుతో మార్కెట్లోని దుకాణాలను కూల్చివేశారు. నగరంలో రైతు బజార్లు ఉన్నప్పటికీ నగర ప్రజల అవసరాలను తీర్చడంలో కొత్త కూరగాయల మార్కెట్‌దే సింహభాగం. అలాంటి కూరగాయల మార్కెట్ ను ఒక్క దెబ్బతో విధ్వంసం చేశారు. దీంతో వందలాది మంది చిరు వ్యాపారులు రోడ్డున పడ్డారు. కూరగాయల మార్కెట్లో ఉంటున్న వ్యాపారులు నగరపాలక సంస్థకు రూ.12 కోట్ల అద్దె బకాయిలు ఉన్నారని, అందుకే దుకాణాలు కూల్చివేసినట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, నగర పాలక సంస్థ అధికారులు చెబుతున్నారు.

బడా వ్యాపారులకు అప్పగించే కుట్రలు..

కొత్త కూరగాయల మార్కెట్ ను బడా వ్యాపారులకు కట్టబెట్టే కుట్రలు జరుగుతున్నాయని జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ స్థలంలో షాపింగ్ మాల్ నిర్మించేందుకు అధికార పార్టీకి చెందిన ఒక బడా వ్యాపారవేత్తకు మార్కెట్ స్థలం అప్పగించేందుకు ఒప్పందం జరిగిందని చెప్పుకుంటున్నారు. బకాయిలు ఉంటే వసూలు చేస్తారు కానీ దుకాణాలు ఎందుకు కూలుస్తారని కొందరు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

ఖబరస్థాన్ విషయంలోనూ అదే ధోరణి...

ముస్లిం ఖబరస్థాన్ విషయంలోనూ ఎమ్మెల్యే దామచర్ల అదే తరహా ధోరణితో వ్యవహరించడంపై నగరంలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఎన్టీఆర్ వర్ధంతి రోజున కమ్మపాలెంలో జరిగిన సభలో ప్రసంగించిన ఆయన కమ్మపాలెం అభివృద్ధి కోసం ముస్లింలకు ఇచ్చిన ఖరస్థాన్ స్థలాన్ని రద్దు చేస్తానని బహిరంగంగా ప్రకటించారు. ఆ స్థలంలో పార్క్ ను ఏర్పాటు చేస్తానన్నారు. ఒక సామాజిక వర్గానికి మేలు చేయడాన్ని ఎవరూ అభ్యంతరం చెప్పరు. అందుకోసం మరొక సామాజిక వర్గానికి నష్టం చేసేందుకు పూనుకోవడం సరైన నిర్ణయం అనిపించుకోదని ముస్లింలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముస్లింల నుంచి వ్యతిరేకత వ్యక్తమైనా ఆయన వెనకంజ వేయలేదు. ముస్లిం ఖబరస్థాన్ కోసం గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 2 ఎకరాల స్థలాన్ని రద్దు చేస్తూ కౌన్సిల్ అజెండాలో పెట్టారు. ప్రస్తుతానికి ఆ అంశాన్ని వాయిదా వేసినా ఖబరస్థాన్ స్థలాన్ని రద్దు చేసేందుకే నిర్ణయించుకోవడం ముస్లింలు జీర్ణించుకోలేక పోతున్నారు.

నేడు కొప్పోలులో..

తాజాగా కొప్పోలులో కూడా ఆక్రమణల పేరిట ఇళ్లు, దుకాణాలు కూల్చివేస్తున్నారు. కాలువల నిర్మాణం, కొప్పోలు అభివృద్ధి పేరిట నిరుపేదల ఇళ్లు మాత్రమే కూల్చివేసి తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన నాయకుల ఇళ్లను, దుకాణాలను వదిలిపెట్టడంతో స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. రైల్వే ఫ్లై ఓవర్ తూర్పు వైపున ఉన్న భవనాలను కూల్చివేస్తుండగా ఇందిరా కాలనీకి చెందిన ప్రజలు అడ్డుకున్నారు. అయినా ప్రయోజనం లేకుండా పోయింది. రోడ్డుకు అడ్డంగా రాళ్లు పెట్టి నిరసన తెలిపారు. పోలీసులు రంగంలోకి దిగి అడ్డుకున్నారు. అయితే ఒక టీడీపీ నాయకుడు రోడ్డును ఆక్రమించి నిర్మించిన ఇంటిని మాత్రం వదిలిపెట్టడం గమనార్హం. నగరపాలక సంస్థ అధికారులను అడ్డంపెట్టుకుని దామచర్ల సాగిస్తున్న విధ్వంసంపై అన్ని వర్గాల ప్రజలు మండి పడుతున్నారు.

రోశయ్య విగ్రహం తొలగింపునకు యత్నాలు...

గత ప్రభుత్వ హయాంలో బాపూజీ కాంప్లెక్స్ వద్ద మాజీ సీఎం కొణిజేటి రోశయ్య విగ్రహం ఏర్పాటు చేశారు. ఆ విగ్రహాన్ని తొలగించే కుట్రలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఆ విగ్రహం చుట్టూ నిర్మించిన గోడను, వాటర్ ఫౌంటేన్‌ను తొలగించారు. దీనిపై ఆర్య వైశ్యుల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో రోశయ్య విగ్రహం తొలగింపును తాత్కాలికంగా వాయిదా వేసుకున్నట్లు తెలిసింది. అదే రోడ్డులో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్, మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు విగ్రహాలు ఉన్నాయి. వాటిని అలాగే ఉంచి ఒక్క రోశయ్య విగ్రహంపైనే దామచర్ల ఎందుకు దృష్టి సారించారని ఆర్యవైశ్యులు మండిపడుతున్నారు.


రోశయ్య విగ్రహం వద్ద ఫౌంటెయిన్, మెట్లు ధ్వంసం చేస్తున్న దృశ్యం (ఫైల్)


కొప్పోలు రోడ్డులో ఆక్రమణలు తొలగిస్తున్న జేసీబీ (ఫైల్)

ప్రభుత్వ ఆస్తులను సంరక్షించండి


- సీసీఎల్ఏ జయలక్ష్మి


వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు సిటీ: ప్రభుత్వ భూములు, ఆస్తులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులపై ఉందని సీసీఎల్ఏ జయలక్ష్మి తెలిపారు. రాజధాని అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో సీసీఎల్ఏ జయలక్ష్మి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పాల్గొన్నారు. ప్రభుత్వ భూములన్నింటినీ పూర్తి స్థాయిలో గుర్తించడానికి రీసర్వే చేయాలని జయలక్ష్మి ఆదేశించారు. రీ సర్వే చేస్తున్న సిబ్బంది సకాలంలో హాజరయ్యేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో నమోదైన దరఖాస్తులను ఈ నెలాఖరులోగా పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంపై నమోదయ్యే అర్జీలను పునఃపరిశీలన చేయాలన్నారు. భూముల రీ సర్వే, తదితర రెవెన్యూ అంశాలపై కలెక్టర్లతో ఆమె చర్చించారు. నిరభ్యంతర ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారికి జీవో నం30 లోని నిబంధనలకు లోబడి క్రమబద్ధీకరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు, సర్వే శాఖ సహాయ సంచాలకుడు గౌస్ బాషా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పాల్‌ల్యాబ్‌లతో సాంకేతిక విద్య చేరువ

- ఉపవిద్యాశాఖాధికారి చంద్రమౌళేశ్వరరావు


మాట్లాడుతున్న డీవైఈఓ చంద్రమౌళేశ్వరరావు

ఒంగోలు సిటీ: పాల్‌ల్యాబ్ శిక్షణ కార్యక్రమంతో సాంకేతిక విద్య ప్రతి విద్యార్థికీ చేరువవుతుందని, శిక్షణను వినియోగించుకొని పాఠశాలల్లో అమలు చేయాలని ఒంగోలు ఉపవిద్యాశాఖాధికారి చంద్రమౌళేశ్వరరావు అన్నారు. మంగళవారం ఒంగోలులోని రామ్‌నగర్ మున్సిపల్ హైస్కూల్లో పాల్‌ల్యాబ్‌లపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన ఏపీఆర్ఎస్, ఏపీఎంఎస్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, ఏపీటీఆర్ఎస్ యాజమాన్య పాఠశాలలకు చెందిన ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులకు పాల్ ల్యాబ్స్ నిర్వహణ, వినియోగం గురించి రిసోర్సు పర్సన్లు వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఒంగోలు డీవైఈవో చంద్రమౌళేశ్వరరావు, ఒంగోలు ఎంఈఓ కిషోర్‌బాబు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీవైఈఓ మాట్లాడుతూ గతంలో 33 పాఠశాలలకు, 28 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఈ పాల్ ల్యాబ్స్ ఏర్పాటు చేశారని, ఇదేక్రమంలో అన్ని పాఠశాలలకు పాల్ ల్యాబ్ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు.

10 నుంచి పొగాకు కొనుగోళ్లు


పొగాకు వేలం కేంద్రం

చీమకుర్తి: జిల్లాలో పొగాకు కొనుగోళ్లు మార్చి 10వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. మంగళవారం గుంటూరులోని పొగాకుబోర్డు కార్యాలయంలో బోర్డు ఉన్నతాధికారులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. తొలిదశలో నాలుగు నుంచి ఐదు వేలం కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభించేందుకు నిర్ణయించినట్టు సమాచారం. జిల్లాలో ఈ ఏడాది 105.27 మిలియన్ కేజీలు కొనుగోలు చేసేందుకు బోర్డు అనుమతి ఇచ్చింది. అధికారికంగా 67 వేల హెక్టార్లలో పంట పండించాల్సి ఉండగా దాదాపు 90 వేల హెక్టార్లలో పంట సాగుచేశారు. ఇప్పటికే కర్ణాటకలో కొనుగోళ్లు పూర్తి కావస్తుండడంతో వచ్చే నెల 10 తేదీ నుంచి రీజియన్ పరిధిలోని 11 కేంద్రాలకు గాను ఐదు కేంద్రాల్లో వేలం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

నేడు శివక్షేత్రాల్లో చెవిరెడ్డి ప్రత్యేక పూజలు

ఒంగోలు సిటీ: మహా శివరాత్రి సందర్భంగా బుధవారం జిల్లాలోని ప్రముఖ శివక్షేత్రాల్లో వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు కనిగిరి నియోజకవర్గం నందనమారెళ్లలో బాలా త్రిపుర కోటేశ్వరస్వామి ఆలయంలో, 10 గంటలకు సీఎస్ పురంలోని గంగమ్మ గుడిలో, 11 గంటలకు భైరవకోనలో ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు త్రిపురాంతకం శివాలయంలో, మధ్యాహ్నం 3 గంటలకు పాదిలి శివాలయంలో పూజలు నిర్వహించి ఒంగోలు చేరుకుంటారు. సాయంత్రం 4.30 గంటలకు ఒంగోలులోని శివాలయంలో, 5.30కు జమ్ములపాలెంలోని శివాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. ఆయా ప్రాంతాల్లోని పార్టీ నాయకులు, మున్సిపల్ చైర్మన్లు, మండల పార్టీ అధ్యక్షులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, పార్టీ అనుబంధ సంఘాల రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు హాజరుకానున్నారు.

శివరాత్రి వేడుకలకు పటిష్ట భద్రత

- ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ప్రముఖ దేవాలయాలు, శైవక్షేత్రాల వద్ద, తిరునాళ్లు, రథోత్సవాలు, ఘాట్‌లు, తీర ప్రాంతాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో పాదిలి, త్రిపురాంతకం, భైరవకోన, మడనూరు ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన శివాలయాలు, దోర్నాల–శ్రీశైలం ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. భక్తులు ఇబ్బంది లేకుండా దర్శనం చేసుకునేందుకు వీలుగా ఆలయ ప్రవేశ మార్గాలు, క్యూ లైన్ల వద్ద తగిన భద్రత కల్పించినట్లు పేర్కొన్నారు. వాహనాల పార్కింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, దేవదాయ, రెవెన్యూ అధికారులు, ఇతర శాఖలను సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని పోలీస్ సిబ్బందిని హెచ్చరించారు. భక్తుల కోసం ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలీసులకు భక్తులు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు ఏమైనా ఉంటే స్థానిక పోలీసులకు లేదా 112, 100 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

నేటి నుంచి ఉపాస్‌లో ఆరోగ్యశ్రీ సేవలు

ఒంగోలు టౌన్: నగరంలోని ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హార్ట్ కేర్ హాస్పిటల్లో బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ వైద్య సేవలు ప్రారంభిస్తున్నట్లు ఆస్పత్రి డైరెక్టర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయ కుమార్, రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, అడిషనల్ ఎస్పీ కె.నాగేశ్వరరావు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజలు ఉపాస్ హాస్పిటల్లో ఆరోగ్యశ్రీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొగాకు బేళ్లు చోరీ

గిద్దలూరు రూరల్: మండలంలోని జయరాంపురం గ్రామానికి చెందిన మోడి పాండు అనే రైతుకు చెందిన పొగాకు బేళ్లను గుర్తుతెలియని దుండగులు అపహరించారు. పొలంలో నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని దుండగులు పొగాకు బేళ్లను అపహరించారని, వాటి విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. బేళ్ల చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ట్రావెల్స్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ఒంగోలు టౌన్: వేగంగా వస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు. ఈ సంఘటన మంగళవారం రాత్రి నగరంలోని మంగమ్మ కాలేజీ సమీపంలో ఆంజనేయ స్వామి గుడి వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. బాపట్ల నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ముక్తినూతలపాడు నుంచి ఒంగోలుకు వస్తున్న మోటారు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ముక్తినూతల పాడుకు చెందిన మొలకలపల్లి వెంకటేశ్వర్లు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైకు వెనుక కూర్చున్న మరో వ్యక్తికి స్వల్ప గాయలయ్యాయి. క్షతగాత్రుడిని జీజీహెచ్‌కు తరలించారు. తాలూకా ఎస్సై సందీప్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



భైరవకోన శివాలయం



విద్యుత్ దీపాలంకరణలో ఒంగోలులోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం



మిట్టపాలెం నారాయణస్వామి ఆలయం

హరోం హర..

- మహాశివరాత్రికి ముస్తాబైన శైవక్షేత్రాలు


ఒంగోలు మెట్రో:

శివరాత్రి అంటే జాగారం.. శివరాత్రి అంటే ఉపవాసం.. మహాశివరాత్రి పర్వదినాన ఆ భోళా శంకరుడిని నియమ నిష్టలతో కొలిస్తే ప్రసన్నుడై వరాలు కురిపిస్తాడని భక్తుల నమ్మకం. నేడు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆ మహాదేవుడిని అర్చించేందుకు జిల్లాలోని శైవక్షేత్రాలన్నీ ముస్తాబయ్యాయి. జ్యోతి స్వరూపుడైన పరమశివుడు స్వయంభువుగా వెలసిన క్షేత్రాల్లో జిల్లాలోని త్రిపురాంతకంలో ఉన్న త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది. ఈ శివాలయం శ్రీచక్ర ఆకారంలో ఉండటం దీని ప్రత్యేకత. అదేవిధంగా జమ్ములపాలెంలోని 108 శక్తిపీఠ సమేత 1116 మహాలింగ సహిత పంచముఖేశ్వర స్వామి క్షేత్రం కూడా ప్రసిద్ధి చెందింది. వీటితో పాటు కొత్తపట్నం మండలంలోని మడనూరు రామలింగేశ్వర స్వామి ఆలయం, రామతీర్థం, భైరవకోన, కోవిలంపాడు నారాయణ స్వామి ఆలయం, పాదిలి నిర్మమహేశ్వర స్వామి ఆలయం, కనిగిరి సమీపంలోని సిద్దేశ్వరం, కంభం సమీపంలో కనక సురభేశ్వరస్వామి ఆలయం, రాచర్ల మండలంలోని సత్యవోలులో పురాతన రామలింగేశ్వరస్వామి ఆలయం, ఒంగోలులోని కాశీవిశ్వేశ్వర స్వామి, సంతపేట సాయి మందిరంలో మహాశివరాత్రి వేడుకలు కన్నుల పండువగా నిర్వహిస్తారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

గుండ్ల బ్రహ్మేశ్వర దర్శనానికి ఆంక్షలతో అనుమతి

- మధ్యాహ్నం 2.30 గంటలకు చెక్‌పోస్ట్ బంద్

గిద్దలూరు రూరల్: నల్లమల అభయారణ్యంలో కొలువైన గుండ్ల బ్రహ్మేశ్వరం ఆలయానికి వెళ్లేందుకు అటవీశాఖ అధికారులు ఆంక్షలతో కూడిన అనుమతులు జారీ చేశారు. గిద్దలూరు మండలంలోని దిగువమెట్ట చెక్‌పోస్టు వద్ద నుంచి గుండ్లబ్రహ్మేశ్వరం ఆలయానికి వెళ్లేందుకు బుధవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు మాత్రమే వాహనాలకు అనుమతి ఇచ్చారు. అభయారణ్యంలోని వన్య ప్రాణులకు ఎలాంటి హాని కలగకుండా వాహనాలు 10 కిలోమీటర్ల వేగంతో వెళ్లేలా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు.



శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి రామతీర్థం, కొత్తపట్నం, కోటప్పకొండ, భైరవకోన, శ్రీశైలం, త్రిపురాంతకం, శైవ క్షేత్రాలకు ప్రయాణికుల సౌకర్యార్థం ఏపీఎస్ ఆర్టీసీ ప్రకాశం రీజియన్ నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని డిస్ట్రిక్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి డి.సుధాకర్ తెలిపారు. సాధారణ చార్జీలతో ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. ఒంగోలు నుంచి కోటప్పకొండకు 45 బస్సులు, శ్రీశైలానికి 25 బస్సులు, ఈ సంవత్సరం ప్రత్యేకంగా కొత్తపట్నం, కొండపి, ఇంకొల్లు, వేములపాడు గ్రామాలకు బస్సు సదుపాయం కల్పిస్తున్నామన్నారు.



ఒంగోలు : సంతపేట సాయి మందిరంలోని కాశీ విశ్వేశ్వరాలయంలో రుద్రాక్షలతో చేసిన శివలింగానికి పూజలు చేస్తున్న మఠంపల్లి దక్షిణామూర్తి

'సఖీ'లో బాధితులకు భరోసా కల్పించాలి

- ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: బాధిత మహిళలు, చిన్నారులకు భరోసా కల్పించాలని సఖీ వన్ స్టాప్ సెంటర్ సిబ్బందికి ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. మంగళవారం ఆయన జీజీహెచ్ ఆవరణలోని సఖి సెంటర్‌ను సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. సెంటర్ సిబ్బంది పని తీరుపై సమీక్షించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. బాధిత మహిళలు, చిన్నారుల పట్ల సహృదయంతో వ్యవహరించాలని సూచించారు. గృహ హింస, లైంగిక వేధింపులు, అత్యాచారాలు, బాల్య వివాహాలు, కిడ్నాప్ తదితరుల సమస్యలతో మహిళలు, బాలికలు సఖి కేంద్రానికి వస్తుంటారని, చట్ట ప్రకారం బాధితులకు న్యాయం చేసేందుకు సహకరించాలని చెప్పారు. జిల్లాలోని అన్ని రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ముఖ్యమైన కూడళ్లలో హోర్డింగులు ఏర్పాటు చేసి సఖి కేంద్రాల ప్రాధాన్యతపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. మహిళలు, చిన్నారులకు ఎటువంటి సహాయం కావాలన్నా ఉమెన్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 181కు కాల్ చేయాలని చెప్పారు. పనిచేసే ప్రదేశంలో వేధింపులు, తలిదండ్రుల నిర్లక్ష్యంపై నిర్భయంగా ఫోన్ చేయాలన్నారు. బాధితుల వినతి మేరకు సఖిలో గరిష్టంగా 10 రోజులపాటు ఆశ్రయంతోపాటుగా భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎస్పీ వెంట డీసీఆర్బీ సీఐ దేవ ప్రభాకర్, సఖీ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ జ్యోతి సుప్రియ, న్యాయవాది ఎస్.స్పందన, మహిళా ఏఎస్సై గౌతమి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలులో రెండు ఇళ్లలో చోరీ

- 14 సవర్ల బంగారం, రూ.1.60 వేలు నగదు అపహరణ

ఒంగోలు టౌన్: తాళాలు వేసి ఉన్న ఇళ్లను దొంగలు లూటీ చేసిన సంఘటన ఒంగోలు నగరంలో మంగళవారం వెలుగుచూసింది. వన్ టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని దారావారి తోటలో షేక్ సుల్తాన్ బాషా, షేక్ ఖాశిం సోదరులు నివసిస్తుంటారు. వీరు బొమ్మలు విక్రయించి జీవనం సాగిస్తుంటారు. మహా శివరాత్రి సందర్భంగా చినగంజాం తిరునాళ్లలో బొమ్మలు విక్రయించేందుకు సోమవారం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో సహా వెళ్లారు. మంగళవారం ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటాన్ని ఖాశిం కుమారుడు బాషా గుర్తించి తల్లిదండ్రులకు విషయం చెప్పాడు. సుల్తాన్ బాషా ఇంట్లో బీరువాలో దాచి ఉంచిన 14 సవర్ల బంగారు నగలు, రూ.30 వేల నగదు, అలాగే ఖాశిం ఇంట్లో దాచి ఉంచిన రూ.1.30 లక్షల నగదు అపహరణకు గురైంది. ఈ మేరకు బాధితులు వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ నాగరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

మద్దిపాడు: మండలంలోని కొలచనకోట గ్రామంలో సోమవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మద్దిపాడు తహసీల్దార్ సుజన్ కుమార్ సీజ్ చేశారు. మంగళవారం మద్దిపాడు రేవు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న మరో ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. వివరాలు.. గత శనివారం మండల పరిధిలోని కొలచనకోట గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని జనసేన పార్టీ నాయకులు మండలంలోని వివిధ శాఖల ఉన్నతాధికారులకు అర్జీలు ఇచ్చారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమంలోనూ మద్దిపాడు మండలంలో అక్రమ ఇసుక దందాపై జనసేన పార్టీ మండల అధ్యక్షుడు నున్నా బాలసుబ్రహ్మణ్యం వినతి పత్రాన్ని అందించారు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి రెవెన్యూ అధికారులు దాడి చేసి కొలచనకోట గ్రామానికి చెందిన ఒక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. మండల కేంద్రంలో జాతీయ రహదారిపై వెళ్తున్న మరో ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఈ రెండు టాక్టర్లను కేవలం ఇసుక అక్రమ రవాణా కోసమే కొనుగోలు చేసినట్లు చర్చ నడుస్తోంది. ట్రాక్టర్లు టీడీపీ శ్రేణులకు చెందినవి కావడంతో రెవెన్యూ, పోలీస్ అధికారులపై ఒత్తిడి చేసి విడిపించేందుకు ఆ పార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

రేపు రాష్ట్ర స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

బేస్తవారిపేట: మహాశివరాత్రి సందర్భంగా బేస్తవారిపేట మండలంలోని మోక్షగుండంలో ముక్తీశ్వర స్వామి తిరునాళ్లను పురస్కరించుకుని గురువారం రాష్ట్ర స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి, రెండో, మూడో బహుమతులు వరుసగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు అందజేస్తామని పేర్కొన్నారు.

అంబాపురంలో..

కొనకనమిట్ల: మహాశివరాత్రి సందర్భంగా కొనకనమిట్ల మండలంలోని వాగుమడుగు పంచాయతీ అంబాపురంలో గురువారం రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అంబ బాల సంగేశ్వరస్వామి ఆలయం ఆవరణలో పాలపళ్ల విభాగం నుంచి ఆరుబంట సైజు వరకు(12 క్వింటాల బండ) ఎడ్ల పోటీలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. గెలుపొందిన ఎడ్లకు మొదటి, రెండో, మూడో బహుమతులు వరుసగా రూ.30, రూ.20, రూ.10 వేలు అందజేస్తామని వివరించారు. శివాలయం వద్ద భక్తులకు అన్నసంతర్పణ చేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 8790612406, 9704364204ను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

నేడు లింగాపురంలో..

కంభం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కంభం మండలంలోని లింగాపురం గ్రామంలో బుధవారం సీనియర్స్ విభాగంలో రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన ఎడ్ల విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ, పంచమ బహుమతులు వరుసగా రూ.60వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు అందజేస్తామని వెల్లడించారు. వివరాలకు 8096743478, 9989298388ను సంప్రదించాలని సూచించారు.

12న ఒంగోలు జాతి పశువుల వేలం పాట

నాగులుప్పలపాడు: మండలంలోని చదలవాడ పశుఉత్పత్తి క్షేత్రంలో మార్చి 12వ తేదీ 53 ఒంగోలు జాతి పశువుల వేలం పాట నిర్వహిస్తున్నట్లు పశుక్షేత్రం డీడీ బి.రవి తెలిపారు. ఒట్టి ఆవులు 14, ఒంగోలు జాతి పెయ్యదూడలు 7, కోడె దూడలు 22, ఒంగోలు జాతి కోడెలు 10, మొత్తం 53 పశువులకు వేలం పాట నిర్వహిస్తారన్నారు. పాటలో పాల్గొనేవారు ముందుగా తమపేర్లు నమోదు చేయించుకొని ప్రతి పశువుకు రూ.5 వేల ధరావత్తు చెల్లించాలన్నారు. పాటలో గెలుపొందిన వారు మొత్తం సొమ్ము వెంటనే చెల్లించి పాడిన పశువును తరలించుకుపోవాలన్నారు. లేకుంటే రోజుకు రూ.500 అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. పాటలో పాల్గొను వారు పశు పోషకులుగా స్థానిక పశువైద్యశాల వైద్యాధికారి దగ్గర నమోదు చేసుకొని ఉండాలని తెలిపారు. పాటలో నెగ్గని వారు వారు చెల్లించిన ధరావతు తిరిగి ఇస్తారని, ధరావతు చెల్లించేటప్పుడు పొందిన రశీదును వాపసు చేయాలన్నారు. పాటలో పాల్గొనే ఆసక్తి గలవారు 11వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పశుక్షేత్రం ఆవరణలో పశువులను పరిశీలించవచ్చని డీడీ తెలిపారు.

ఎడ్ల బండిని ఢీకొట్టిన బైక్

- యువకుడు మృతి, మరో ఇద్దరికి గాయాలు

సింగరాయకొండ: ప్రమాదవశాత్తు ఎడ్ల బండిని మోటారుసైకిల్ ఢీకొనడంతో ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన సోమవారం అర్ధరాత్రి సింగరాయకొండ–కందుకూరు జాతీయ రహదారిపై మలినేని ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కనిగిరి మండలం శాఖవరం గ్రామానికి చెందిన కరాటపు నాని(23) కందుకూరులో నివాసం ఉంటున్నాడు. సోమవారం రాత్రి బైక్‌పై అతని స్నేహితులు మదన్‌నాయుడు, విజయ్‌కుమార్, మరో మోటారుసైకిల్ పై పాశం అఖిల్, నరగా అభిరామ్‌తో కలిసి కందుకూరు నుంచి సింగరాయకొండ వస్తున్నాడు. ఈ క్రమంలో మలినేని కాలేజీ సమీపంలో ఎడ్ల బండిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో నానికి అంతర్గత గాయాలు కాగా మదన్‌నాయుడు, విజయ్‌కుమార్‌కు రక్తగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో ఒంగోలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నాని మృతి చెందాడు. ఒంగోలు జీజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు.



ఆస్పత్రిలో మృతి చెందిన నాని

ఆలయంలో హుండీలు చోరీ

మద్దిపాడు: మండల కేంద్రమైన మద్దిపాడులోని సాయిబాబా మందిరంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు పక్కనే ఉన్న సాయిబాబా మందిరం పూజారి సోమవారం రాత్రి 10 గంటలకు తాళం వేసి ఇంటికి వెళ్లారు. తెల్లవారుజామున రెండు గంటల సమయంలో మూత్ర విసర్జనకు లేచి చూడగా ఆలయ ప్రధాన ద్వారం తాళం ధ్వంసమై ఉంది. ఆలయంలోని రెండు హుండీలు పగలగొట్టి ఉండటాన్ని గమనించి ట్రస్టీకి సమాచారం ఇచ్చారు. మద్దిపాడు ఎస్సై శివరామయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, హుండీల్లో ఎంత మొత్తంలో కానుకలు ఉన్నాయనే వివరాలు తెలియరాలేదు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

మద్దిపాడు: మండల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి పోక్సో కేసు నమోదైంది. మద్దిపాడు పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని గాజులపాలెం గ్రామానికి చెందిన యువకుడు ఓ బాలికను మాయమాటలతో లోబర్చుకున్నాడు. ఈనెల 20వ తేదీన ఆ బాలికను ఇంటి నుంచి తీసుకెళ్లిపోయాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మద్దిపాడు పోలీసులు బాలిక అదృశ్యం కేసు నమోదు చేశారు. అనంతరం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి బాలిక ఆచూకీ కనుగొని మద్దిపాడు తీసుకొచ్చారు. బాలికను విచారించగా ఆమె ఇచ్చిన సమాచారం ప్రకారం పోలీసులు మిస్సింగ్ కేసును పోక్సో కేసుగా మార్పు చేశారు.

అయ్యయ్యో.. సాంబార్ డీర్



నడవలేని స్థితిలో కడితి



ఎట్టకేలకు బంధించి..



రెస్క్యూ వాహనంలోకి ఎక్కిస్తూ..

- గుర్తు తెలియని వాహనం ఢీకొని గాయాలు
- బోడేనాయక్ తండా బస్టాప్ వద్ద ఘటన

పెద్దదోర్నాల: రోడ్డు దాటేందుకు ప్రయత్నిస్తున్న సాంబార్ డీర్(కడితి)ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గాయాలపాలైంది. ఈ సంఘటన మంగళవారం పెద్దదోర్నాల మండల పరిధిలోని శ్రీశైలం ఘాట్ రోడ్డులో బోడే నాయక్ తండా సమీపంలో చోటు చేసుకుంది. కాలికి గాయాలై నడవలేని స్థితిలో రోడ్డు పక్కన పడి ఉన్న కడితిని గుర్తించిన స్థానికులు.. వెంటనే అటవీ శాఖాధికారులకు తెలియజేశారు. రెస్క్యూ వాహనంతో సంఘటనా స్థలానికి చేరుకున్న అటవీ సిబ్బంది.. గాయపడిన కడితిని నంద్యాల జిల్లా ఆత్మకూరులోని పశు వైద్యశాలకు తరలించారు. కాగా, కడితి తీవ్రంగా ప్రతిఘటించడంతో రెస్క్యూ వాహనంలోకి ఎక్కించేందుకు బీట్ ఆఫీసర్ బాబు, అటవీశాఖ సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.

ఏకేయూ నిర్మాణానికి నిధులివ్వాలి

సంతనూతలపాడు: ఈనెల 28న రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే వార్షిక బడ్జెట్‌లో ఆంధ్రకేసరి యూనివర్శిటీ నిర్మాణానికి తగినన్ని నిధులు కేటాయించాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. పేర్నమిట్ట కొండపై వర్శిటీ ఏర్పాటుకు కేటాయించిన భూములను సీపీఎం నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యూనివర్శిటీకి సంబంధించి ఇప్పటివరకు పేర్నమిట్ట కొండపై ఒక భవనం మాత్రమే ఉందని, పూర్తి స్థాయిలో వర్శిటీని నిర్వహించేలా నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ చూపాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికైనా తరగతులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జి.రమేష్, పూసపాటి వెంకటరావు, నెరుసుల వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్, అన్నె సుబ్బారావు, డి.చినబాబు, సయ్యద్ హుస్సేన్, కె.కృష్ణారెడ్డి, తంబి శ్రీను, తుళ్లూరి సుబ్బారావు, ఆముదాల కోటేశ్వరరావు, వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ సబ్ జూనియర్ జిల్లా క్రీడాకారులు వీరే

ఒంగోలు: ఫెన్సింగ్ సబ్ జూనియర్ (అండర్ 14) క్రీడాకారుల ఎంపిక మంగళవారం స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించినట్లు ఏపీ ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.నవీన్ తెలిపారు. ఫాయిల్, ఈపీ, సాబ్రే విభాగాల్లో బాలబాలికల ప్రతిభను పరిశీలించి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను ఎంపిక చేశారని, ఎంపికైన క్రీడాకారులు మార్చి 1, 2 తేదీల్లో ఎన్‌టీఆర్ జిల్లా పొన్నవరంలోని ఏకత్వ పబ్లిక్ స్కూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన క్రీడాకారులకు ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు.

ఫాయిల్ విభాగం–బాలురు: జె.జగదీశ్వర్, సీహెచ్ జ్ఞానేశ్వర్, బి.అక్షయ్, టి.లలితేష్



ఎంపికైన అండర్ 14 ఫెన్సింగ్ జిల్లా క్రీడాకారులు

ఫాయిల్ విభాగం–బాలికలు: ఎస్.హర్షిణి, ఎస్.రిత్విక

ఈపీ విభాగం–బాలురు: జె.శ్రీసాయి చరణ్, వై.కుస్వంత్‌కుమార్, ఎస్.అయాన్ మహీబ్, డి.చరణ్ సాయి ఫణీశ్వర్

ఈపీ విభాగం–బాలికలు: టి.మిథిలా చౌదరి, డి.లక్ష్మీ షణ్ముఖప్రియ, యు.పూర్వి, బి.వెంకట సౌమ్యశ్రీ

సాబ్రే విభాగం–బాలురు: ఈ.తనూజ్ కుమార్, టి.అభినవ్ బుధ, కె.తారక్‌రామ్

సాబ్రే విభాగం–బాలికలు: వి.లేఖన, వి.జ్యోతిక, పి.చక్రిక, ఈ.వెంకట సాయి మహిత